# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజూల దాసు

తెలంగాణ శుక్రవారం, 10 - అక్టోబర్ - 2025 సంపుటి : 16 సంచిక : 72 పేజీలు 08 వెల : 6/-


## హైకోర్టు తీర్పుతో

బీసీ రిజర్వేషన్లపై టైమ్స్ ఆఫ్ వార్త ముందే జోస్యం..

# ఆశావాహుల ఆశలు గల్లంతు?

- హైకోర్టు తీర్పును ముందే ఊహించి చెప్పింది
- బిసి రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్ పార్టీకి దెబ్బ
- కాంగ్రెస్ క్యాడర్ మోరల్ డౌన్ అయితే వారి దారేటు??
- ప్రజా గమనం తప్పితే ఓటమి వేగం పెరుగుతుంది
- ప్రజల నమ్మకం కదిలింది.. చట్టం తారుమారయింది
- న్యాయ సూత్రాలను విస్మరిస్తే రాజకీయాలు నడుస్తాయా..
- మళ్లీ ఎన్నికలు వస్తే కాంగ్రెస్ గెలుస్తుందా?




టైమ్స్ ఆఫ్ వార్త - ప్రత్యేక ప్రతినిధి ఖాజా భాయి

రాష్ట్ర ప్రజల పక్షాన స్థానిక సంస్థల ఎన్నికలను వేగంగా అడుగు వేస్తే ప్రజాభిప్రాయం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా అవుతుందన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చట్ట పరమైన జాగ్రత్తలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి ముందుకు సాగిందని కాంగ్రెస్ పార్టీలోని ఒక వర్గం అభిప్రాయపడుతుంది. ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన హడావుడి న్యాయపరమైన అవగాహన లేకపోవడమే పార్టీకి ప్రమాదకరంగా మారిందని అభిప్రాయపడుతున్నారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు గురువారం వెలువరించిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బగా మారిందని, సుప్రీం కోర్ట్ మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పార్టీ పెద్దలు వాటిని పట్టించుకోకుండా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకుని పోవడంతో, చివరికి న్యాయంచేయలేని నాయకత్వంగా చరిత్రలో నిలిచిపోనున్నది. ప్రజాసేయచ్చు కంటే ఎన్నికలపై దృష్టి పెట్టడం వల్ల కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది. స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా పూర్తి చేయాలన్న తొందర్లో చట్టపరమైన రిజర్వేషన్ల గడంకాలు అన్ని పక్కన పెట్టడంతో పార్టీకి నష్టం కలుగుతుంది.తక్షణ ఫలితం దీర్ఘకాలం పార్టీకి నష్టం కలిగిస్తుందన్న స్థితిలో కాంగ్రెస్ పార్టీ డోలైలామాలో నెట్టేసింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పులు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పార్టీ అధిష్టానం పట్టించుకోకుండా ఎన్నికలను ముందుకు నడపడం కాంగ్రెస్ ప్రభుత్వ న్యాయ సలహాదారులపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో మేధావులు ఉన్నప్పటికీ చట్టాల పట్ల సున్నితమైన దృష్టి లేకపోవడంతో పార్టీకి నష్టం కలిగిస్తుందని




కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, రేకెత్తించిన ఆషలు నెరవేరకముందే ప్రజా విశ్వాసాన్ని కొంచెం కొంచెంగా కోల్పోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక తెలంగాణ




### బిఆర్ఎస్, బిజెపిలను

# బిసిలు క్షమించరు

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం న్యాయపోరాటం చేస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో గురువారం సాయంత్రం మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కు మార్ గౌడ్‌లతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని హైకోర్టు చెప్పిందని, ఎన్నికలు జరపడానికి బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లను చిత్తశుద్ధితో ఇవ్వడానికి ప్రయత్నం చేశామని ఆయన తెలిపారు. 2018లో బిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ కటాఫ్ 50శాతం చేస్తూ చట్టం చేసిందని, ఓబిసిలకు రిజర్వేషన్ ఇవ్వాలని ఆనాటి ప్రభుత్వం ప్రయత్నం చేయలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈరోజు బిఆర్ఎస్, బిజెపి తమపై నిందలు వేస్తుందని, ప్రజలు అమాయకులు కాదని ఆయన అన్నారు. బిసి సంఘాల నాయకులు అంతకంటే అమాయకులు కాదని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్, బిజెపిలను క్షమించరని స్పష్టం చేశారు. ఎంపిరికల్ డాటా లేకుండా రిజర్వేషన్ ఎలా ఇస్తారని ఆనాడు కోర్టు చెప్పిందని, జిఓ9 ను తీసుకురావడానికి సిపెక్ సర్వే చేశామని, సైంటిఫిక్‌గా సర్వే చేసి వాటిని బిల్లు రూపంలోకి తెచ్చామని, ఎక్కడా పొరపాటు జరగకుండా సర్వే చేశామని ఆయన తెలిపారు. రిజర్వేషన్‌ల కోసం న్యాయ స్థానాల్లో, రాజకీయంగా పోరాటం చేస్తాం తాము సభలో చేసిన బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉందని, తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బిల్లును ఆపింది బిజెపి ప్రభుత్వం కాదా అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. బిజెపి బిల్లులు ఆపుతుందని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ 50 శాతం స్లాబ్ దాటకుండా చట్టం చేశారని, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బిసిల నోటికాడి ముద్ద లాక్కున్నాయని, ఆ రెండు పార్టీలు కూడ బలుక్కొని అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. వారా మా చిత్తశుద్ధిని ప్రశ్నించేదని డిప్యూటీ సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ మూడు నెలలుగా బిల్లుల గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అది చట్టంగా మారినట్టేనని అందుకే జిఓ ఇచ్చామని ఆయన తెలిపారు. సర్వేలో కూడా పాల్గొనని పార్టీలు ఈరోజు మాట్లాడుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు.



### ఆరు గ్యారంటీల తరహాలోనే

# 42శాతం డ్రామాలు

**55 ఏళ్లు అధికారంలో ఉన్నా బిసిలకు మొండిచేయి**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా? అంటూ ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ నేతలు జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కోట్లాడాలని హితవు పలికారు. కలిసి వచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారు తప్పా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్దత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్కదోవ పట్టించారని.. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు.

# అమెరికా, భారత్ మధ్య ఆర్థికవృద్ధికి సహకరించాలి

- నిర్ణయాలు, విధానాలు సంబంధాలు పెంచేలా ఉండాలి
- సుంకాల పెంపు, హెచ్1 బీ వీసాకు నిబంధనలపై సీఎం ఆందోళన
- అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

అమెరికా, భారత్ మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు సానుకూల దృక్పథంతో రెండు దేశాల మధ్య సంబంధాల ను మరింత పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్1 బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయటంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను పంచుకున్నారు. వారితో గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన

# సర్కార్ నడవట్లేదు..సర్కస్ నడుపుతున్నారు

- బస్‌ఛార్జీల పెంపుతో కుటుంబాలపై భారం
- మహిళలకు ఉచితబస్సు..మగాళ్లపై ఛార్జీల భారం
- బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
శుక్రవారం,
10-10-2025


## చింతకానిలో సీపీఐ పార్టీ సత్తా చాటాలి

**6 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ**

**సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు**



టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

చింతకాని మండలంలో సీపీఐ పూర్వ వైభవం చాటాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం చింతకానిమండల సీపీఐ పార్టీ కార్యాలయంలో పదిమల వెంకటనర్సయ్య అధ్యక్షతన జరిగిన మండల సమితి సమావేశంలో భాగం హేమంతరావు మాట్లాడుతూ సీపీఐ కాంగ్రెస్ పొత్తుకు సిద్దంగా ఉందన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. నాగిలిగొండ, నేరడ, కొదుమూరు, రామకృష్ణాపురం, ప్రొద్దుటూరు, చిన్నమండవ ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు స్థానిక నాయకత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. సీపీఐ జడ్పీటీసీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, రాఘువావపురం మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావును మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. పార్టీ నిర్ణయం మేరకు స్థానిక నాయకత్వం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర నమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ నభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచివపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్ రావు, కన్నెబోయిన విజయమ్మ, నాయకులు దొబ్బల వెంగళరావు, గోగుల ఆది, కొల్లి రవి, పగిళ్లపల్లి ఏను తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ నిజామాబాద్ జిల్లాలో తొలి విడత ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్, బోధన్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 18 మండలాలైన బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, ధర్పల్లి, డిచ్పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నవీపేట్, నిజామాబాద్, సిరికొండ జెడ్పీటీసీ స్థానాలతో పాటు, పై మండలాల పరిధిలోని 177 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో మోస్రా, చందూర్, రుద్రూర్ మండల కేంద్రాలలోని ఎం.పీ.డీ.ఓ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారా అని పరిశీలించారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖ లైన నామినేషన్లకు సంబంధించిన అఫి డవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్.ఓలకు సూచించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవ సరమైన సహకారం అందించాలని సూచి ంచారు. ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబం ధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్ర దించాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు ఉన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల నియమాలను ఉల్లంఘించరాదు

**జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్**

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిది

జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మెదక్ ఎంపీడీఓ కార్యాలయం మరియు హవేలీఘనపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్.పి.టి.సి, ఎం.పి.టి.సి నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల జడ్.పి.టి.సి, ఎం.పి.టి.సి ఎన్నికల నామినేషన్ల దాఖల సందర్భంలో రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ కండక్ట్)ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు సందర్భంగా ఊరేగింపులు నిర్వహించాలనుకుంటే, ముందుగా పోలీస్ శాఖ అధికారుల నుండి అనుమతి పొందాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత ప్రాంత పోలీసులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు.అదనపు ఎస్పీ అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సమగ్ర సూచనలు చేశారు.

**జిల్లా అదనపు ఎస్పీ ముఖ్య సూచనలు:**

**అభ్యర్థులు అనుమతి పొందిన వాహనాలను మాత్రమే వినియోగించాలి**

**ఊరేగింపు కార్యక్రమాలు ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలి**

**కుల, మత, ప్రాంత, వర్గ విభేదాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడరాదు**

వాహనాలకు లౌడ్ స్పీకర్లు వినియోగించాలంటే సంబంధిత అధికారుల నుండి అనుమతి తప్పనిసరిగా పొందాలి.వాహనాలపై రిటర్నింగ్ అధికారి జారీ చేసిన పర్మిట్ ఒరిజినల్ కాపీతో పాటు వాహనం నంబర్, అభ్యర్థి పేరు స్పష్టంగా విండ్స్క్రీన్‌పై ప్రదర్శించాలి.

**నామినేషన్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లడానికి అనుమతి లేదు**

నామినేషన్ సమర్పించడానికి ఊరేగింపుతో వచ్చే అభ్యర్థి తన అనుచరులు, మద్దతుదారులు మొదలైన వారు రిటర్నింగ్ అధికారి కార్యాలయనికి 100 మీటర్ల పరిధి వరకు మాత్రమే అనుమతించబడును.రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి ప్రవేశం ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థి మరియు మరో ఇద్దరికి మాత్రమే అనుమతించబడుతుంది.



## బిఆర్ఎస్ నాయకుల అరెస్ట్




టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

మధిర నియోజకవర్గంలో కొనసాగుతున్న అరెస్టులు. బస్భవన్, ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసిన చింతకాని పోలీసులు.

## జడ్పిటిసి స్థానానికి సిపిఐ పార్టీ అభ్యర్థిగా కొండపర్తి



టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చింతకాని మండల సమితి సమావేశంలో చింతకాని జెడ్పిటిసి స్థానానికి, 6 ఎంపీటీసీ స్థానాలు పోటీ చేయడానికి సిపిఐ పార్టీ నిర్ణయించడం జరిగింది చింతకాని జడ్పిటిసి స్థానానికి సిపిఐ పార్టీ అభ్యర్థిగా రాఘవపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావును ఎంపిక చేసినట్లు సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాల రావు ప్రకటించినారు.

## ఎమ్మెల్యే కృష్ణా రావుని పోలీసుల ముందస్తు హౌస్ అరెస్టు

**చలో బస్‌భవన్ నిరసన కార్యక్రమం నిరోధితం..**

**ఇంత దుర్మార్గమా భార్య కు ఫ్రీ ఇచ్చి భర్త దగ్గర వసూలు చేస్తున్నారు..**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

తెలంగాణ బిఆర్ఎస్ పార్టీ ఐక్య ప్రయత్నంలో భాగంగా నిర్వహించబోయిన "చలో బస్‌భవన్" ముందు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా నిర్వహించబోయిన చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని పోలీసులు నిరోధించడం ప్రజాస్వామ్యానికి భారీ ఆడ్డుకట్ట అని పేర్కొన్నారు. ప్రజలు అవసరమైనపుడు రాజ్యాంగబద్ధమైన మార్పుల కోసం శాంతియుతంగా తమ హక్కులను వినిపించే హక్కు కలిగి ఉన్నారని, దానిపై నిషేధాలు వేయడం అన్యాయం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పరిపాలనకు ఓ ఉదాహరణగా మారిందని, ప్రజలు ఇప్పటికే ఈ ప్రవర్తనను తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు.ఎన్ని నిర్బంధాలు చేసినా ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నిజామాబాదు మండల విద్యాశాఖ అధికారి ఎం. సాయరెడ్డి ఉద్బోదించారు.నిజామాబాదు నగరంలోని కస్బాగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆద్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఎంఈఓ సాయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి. రాఘవేందర్, కోశాధికారి అంకం రాజేందర్, పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్, ప్రోగ్రాం చైర్మెన్ యెండల ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు బి. సుజాత, అస్మా జరీన్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో క్రీడా స్ఫూర్తికై కీలక అడుగు..

**స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తో శేరి సతీష్ రెడ్డి భేటీ**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గంలో యువతను క్రీడల వైపు మల్లించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి కీలక అడుగు వేశారు. ఈ క్రమంలో, ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు తెలంగాణా రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటీ (ఎస్ఏఏటి) చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ ఇంచార్జ్ కొత్తకపు శివసేనా రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు.కూకట్ పల్లి నియోజకవర్గంలో క్రీడా కార్యక్రమాలను బలోపేతం చేయడం, యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడం, అలాగే క్రీడా వసతులను మెరుగు పరచడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు శేరి సతీష్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు 114 డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్,115 డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్, మేకల మైకేల్,రేష్మ, మస్తాన్ రెడ్డి, కిట్టూ, పవన్, శ్రీధర్ చారి, రామక్రిష్ణ రెడ్డి, గిరి నాయుడు, రవాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక స్టేలు ఇవ్వలేదు

**తాజాగా హైకోర్టు స్టేపై ఎంపి మల్లు రవి**

న్యూఢిల్లీ: ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టుగాని, హైకోర్టుగాని స్టే ఇచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు మూడు నెలల్లోగా రాష్ట్రపతి, గవర్నర్ బిల్లుకు ఆమోదం తెలపకపోతే.. ఆమోదం పొందినట్టుగా భావించాల్సి ఉంటుందని చెప్పిందని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్లు ఇవ్వడంతో చాలామంది నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. ఎన్నికలు పెట్టకపోవడంతో పంచాయతీకి రావాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావడం లేదని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం బీసీ రిజర్వేషన్లు చేశామని మల్లు రవి తెలిపారు. అసెంబ్లీలో పెట్టామని, అన్ని పార్టీలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. బీసీలు 56 శాతం ఉన్నారని రిపోర్ట్ వచ్చిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. 50? సీలింగ్ అప్పుడే దాటిందని అన్నారు. హైకోర్టు స్టే ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కన పెట్టినట్టు గుర్తించాల్సిందే అని వెల్లడించారు. రిజర్వేషన్లపై జడ్జిమెంట్ రావడం అంటే ప్రజాస్వామ్యం గురించి చాలా లోతుగా అసెంబ్లీలో, పార్లమెంట్లో చర్చ జరగాలని ఆయన సూచించారు.

## జిల్లాకు చేరుకున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు

**-సాధారణ పరిశీలకులు వాసం వెంకటేశ్వర్ రెడ్డి.**

**-వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ బాబు.**



టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి

స్థానిక ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లాకు సాధారణ పరిశీలకులు వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్,వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ బాబులు మెదక్ జిల్లాకు చేరుకున్నారు. వారికి స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ,అదనపు కలెక్టర్ నగేష్ పుష్ప గుచ్చంతో స్వాగతం పలికారు. వారు ఇరువురు జిల్లాలో స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ లెక్కలు,ఎన్నికల విధానాన్ని తెలుసుకోనున్నారు.

## శివారెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మత్తులు

టైమ్స్ ఆఫ్ వార్త - శంకర్పల్లి





శంకర్పల్లి మండలం అలంకానుగూడ గ్రామానికి చెందిన శివారెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాడు అలంకారం కూడా గేటు నుండి ఊర్లోకి వెళ్లే రోడ్డుకు గుంతలు ఏర్పడడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది గురయ్యారు ఈ విషయాన్ని గమనించిన సదరు మీడియా ప్రతినిధి శివారెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు ఇలాంటి సమస్యను పట్టించుకోకపోవడం అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్టుగా వదిలేయడం బాధాకరంగా ఉందని పాత్రికేయ మిత్రుడు వాపోయాడు



since 2007
# టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# మీసేవ కేంద్రాన్ని పరిశీలించిన మండల తహశీల్దార్ సతీష్

### మీసేవ కేంద్రం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి
### మండల తహశీల్దార్ కు వినతి పత్రం

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**
పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రజలను ఇబ్బందుల గురిచేస్తున్నారని వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీ నాయకులు, యువ నాయకులు, సోషల్ మీడియా వారియర్లు కోరారు. గురువారం పట్టణ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల మీ సేవ కేంద్రాన్ని మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మీ సేవ కేంద్రం పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన అఖిలపక్ష పార్టీ నాయకులు, యువ నాయకులు, సోషల్ మీడియా వారియర్లు ఆయనకు మీ సేవ కేంద్రం సిబ్బంది పనితీరు పై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ, పట్టణ ప్రాంత ప్రజలకు పౌర సౌకర్యాల సేవలు నిమిత్తం మీసేవ కేంద్రానికి వస్తున్న విద్యార్థులను, యువకులను, వృద్ధులను అవహేళన చేస్తూ, ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ, ప్రజలకు తెలియని విషయాల గురించి సలహాలు సూచనలు ఇవ్వకపోగా, వారిని బెదిరిస్తూ, సమయపాలన పాటించకుండా మీసేవ కేంద్రం మేనేజర్ ఉపేందర్, ఇంచార్జ్ జనార్దన్ లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈసందర్భంగా మండల తహశీల్దార్ సతీష్ సానుకూలంగా స్పందించి, తగు విచారణ నిర్వహించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక కార్యక్రమంలో పట్టణ అఖిల పక్ష పార్టీల నాయకులు, యువ నాయకులు ఆకారం రమేష్, బండి శంకర్, దినేష్, శేఖర్, బండారి రాజేశం, కత్తి రమేష్, మాయ రమేష్, సీపెల్లి సాగర్, రాయబారపు కిరణ్, చిప్పకుర్తి శశిధర్, ఎండి జావిద్ ఖాన్, క్రాంతి, రాజు లు పాల్గొన్నారు.



# జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**
జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఛలో బస్ భవన్ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీస్‌లు..

### మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ను ముందస్తు హౌస్ అరెస్ట్
### ప్రజా ప్రయోజనాల కోసం పోరాడే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అవమానం..



**టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి**
బి ఆర్ యస్ పార్టీ తలపెట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమం లో భాగంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ను ముందస్తు హౌస్ అరెస్ట్ చేసిన కుకట్ పల్లి పోలీసులు..రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయంగా బస్ ఛార్జీలు పెంచిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, బస్ భవన్ వద్ద పెద్ద ఎత్తున శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించడానికి సిద్ధమైన మమ్మల్ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారని మహిళలకు ఫ్రీ బస్ అని ఆ భారం అంతా పురుషుల మీద పెంచి ప్రజలపై భారం మోపే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ,ప్రజా ప్రయోజనాల కోసం పోరాడే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అవమానమని పేర్కొన్నారు..

# ఆకతాయిల ఆట కట్టించిన షీ టీం

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**
ప్రైవేట్ బాలికల వసతి గృహాల వద్ద వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఆకతాయిల ఆటలను జిల్లా షీ టీం సిబ్బంది అరికట్టారు. ఈ సందర్భంగా జిల్లా షీ టీం ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ, జిల్లా షీ టీం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్ లో జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో ప్రైవేట్ బాలికల వసతి గృహాల వద్ద వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఏడుగురు ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని,అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా విద్యార్థినీలు ఆకతాయిల వేధింపులకు గురైతే డయల్ 100,రామగుండం షీ టీం నెంబర్ 6303923700 లకు ఫోన్ చేసి,వాట్సప్ లోనైన సమాచారం అందించాల్సిందిగా సూచించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినీల భద్రతే షీ టీం లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

# ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి రూరల్/మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని మందమర్రి, తాండూర్, బెల్లంపల్లి మండల కేంద్రాలలో గల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం విడుదల చేసిన కార్యచరణ ప్రకారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అర్హత గల ప్రతి ఒక్కరూ ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ ఎన్నికల సంఘం ఆదేశాలకు లోబడి చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మందమర్రి మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, ఆయా ఎంపిడిఓ లు, కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలను ప్రదర్శించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేటీఆర్ ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పేర్కొన్నారు, ఇన్నాళ్లపాటు అడ్డగోలు విధానాలతో 42 శాతం హామీను నిర్ధారించకుండా నిలిపి, రేవంత్ రెడ్డి బీసీలను దారుణంగా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కేటీఆర్ ప్రకారం, కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానంలో నిలబడని జీఓ ద్వారా బీసీలకు హామీ ఇచ్చినట్లు మభ్యపెట్టింది. కేంద్ర ప్రభుత్వంలో బీజేపీ కూడా వెన్నుపోటు పొడిచిన నేపథ్యంలో, ఎన్నికల సమీపంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసంని హైకోర్టు ఆపింది. కేటీఆర్ చెప్పారు, కాంగ్రెస్ పార్టీ తనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను ఎదుర్కోలేక, ఎన్నికల వాయిదా కోసం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనానికి వాడుకుంది. ఈ విధానం ద్వారా బీసీ లకు చెల్లించాల్సిన హక్కులు దుర్వినియోగం అయ్యాయని ఆయన దృష్టి సారించారు. కనీసం ప్రజా వ్యతిరేకత ఎదుర్కోవలసిన పరిస్థితిని సృష్టించిన కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిన గుణపాఠాన్ని తప్పనిసరిగా ఎదుర్కోవాల్సి ఉంటుంది అని కేటీఆర్ హెచ్చరించారు.

# నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలి

### -ఎలాంటి ప్రలోభాలు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి.
### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి**
స్థానిక సంస్థల ఎన్నికలకు నేటినుండి జిల్లా వ్యాప్తంగా నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిరాహుల్ రాజ్ హవేలీ ఘనపూర్ మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియ లో భాగం గా నోటిస్ ప్రదర్శించిన విధానాన్ని అలాగే హెల్ప్ డెస్క్ లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు వారి విధుల పట్ల ఉన్న అవగాహన ను కలెక్టర్ పరిశీలించారు నామినేషన్ స్వీకరణ సమయం లో ఆర్వో, ఏ ఆర్వో ఏమేమి చెక్ చేయాలో క్షుణ్ణంగా కలెక్టర్ వివరించారు .మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా సలహాలు, సందేహాలు ఉంటే అక్కడ సంప్రదించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ జరిగే ఈ మూడు రోజులు ఉదయం 10.30 గంటల నుండి నుండి సాయంత్రం 5 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మెదక్ జిల్లాలో మొదటి దశలో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 మండలాల్లో ఎంపిటిసి , జడ్పీటీసీ లకు నామినేషన్ ల ప్రక్రియ ప్రారంభం అయ్యిందన్నారు.మెదక్ జిల్లాలో 523,327 మంది ఓటర్లు ఉండగా అందులో 251,532 పురుషులు,271,787 మహిళ ఓటర్లు ఉన్నారు..జిల్లాలోమొత్తం 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... మొదటి దశలో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలలో మెదక్, హవేలీ ఘనపూర్ ,రామాయంపేట, నిజాంపేట్, పాపన్నపేట, టేక్మల్ ,అల్లదుర్గం, పెద్ద శంకరం పేట,చిన్న శంకరం పేట 10 జెడ్పీటీసీ స్థానాలు, 99 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ ల ప్రక్రియ మొదలు అయ్యిందనీ తెలిపారు.ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఉన్నత స్థానంలో ఉంచాలని ఏలాంటి ప్రలోభాలకు లొగ్గకుండా ఉండాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరు కావడం గర్వకారణం

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ
### అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



న్యూయార్క్ లో జరుగుతున్న 80వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గర్వంగా ఉందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. సీనియర్ పార్లమెంటరీ నేతల నేతృత్వంలో ఎంపీల బృందం ఈ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం న్యూయార్క్ చేరుకుంది. ఈ సందర్భంగా బృందం భారత శాశ్వత మిషన్ వద్ద వివిధ అంతర్జాతీయ సమావేశాలు, ద్వైపాక్షిక చర్చలు, థీమ్ ఆధారిత చర్చల్లో పాల్గొననుంది. ఈసమావేశంలో ప్రధానంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పేదరిక నిర్మూలన, వాతావరణ మార్పు, శుద్ధ శక్తి వనరుల సమాన ప్రాప్తి, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి, ప్రపంచ శాంతి, భద్రత, దక్షిణ - దక్షణ సహకారం తదితర అంశాలపై ఎంపీల బృందం చర్చలు జరపనున్నారు. ఈసందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, భారతదేశం శాంతి సమానత్వం అభివృద్ధి పట్ల అంకితభావంతో ఉందని తెలిపారు. ఒకే ప్రపంచం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే దృక్పథంతో దేశం ప్రపంచ ఐక్యతకు కట్టుబడి ఉందన్నారు. దేశ ఎంపీల బృందంలో ఒకరిగా ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం. కాగా దశాబ్ద కాలం తర్వాత భారత పార్లమెంట్ నుండి మల్టీ పార్టీ ప్రతినిధి బృందం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం చారిత్రాత్మక పరిణామంగా భావించ బడుతుందని, ఇది దేశ ప్రజాస్వామ్య బలాన్ని అంతర్జాతీయ వేదికపై చాటి చెప్పిందని యునైటెడ్ నేషన్స్ భారత శాశ్వత మిషన్ కార్యాలయం ప్రకటనలో తెలిపింది.



### న్యూయార్క్ లో మహాత్మా గాంధీకి నివాళులు అర్పించిన ఎంపీ వంశీ

ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశాల కోసం అమెరికా పర్యటనలో ఉన్న పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ న్యూయార్క్‌లోని యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి దేశ ప్రతినిధి బృందంతో కలిసి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ, అహింస, శాంతి, సత్యం అనే విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహాత్మా గాంధీ ఆలోచనలు నేటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకాలు అని తెలిపారు. దేశ ప్రతినిధిగా ఐక్యరాజ్యసమితిలో పాల్గొనడం గర్వకారణమని, దేశం కోసం పని చేసే దిశగా తాను కట్టుబడి ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ ప్రతినిధులు, ప్రవాస భారతీయులు, పాల్గొన్నారు.

# కోలిండియా పోటీల్లో సింగరేణి ఖ్యాతిని చాటాలి



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**
సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయి జరిగే పోటీల్లో అత్యధిక ప్రతిభ కనబరిచి, రాణించి, సింగరేణి ఖ్యాతిని చాటాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, క్రీడల గౌరవ కార్యదర్శి, సీనియర్ పిఓ ఎం కార్తీక్ లు తెలిపారు. ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్(డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21 వార్షిక క్రీడల్లో భాగంగా పట్టణంలోని స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నిర్వహించిన డిపార్ట్మెంటల్ వాలీబాల్ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి సిఎండి ఎన్ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కళాకారులు కోలిండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి, సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారన్నారు. సీనియర్ క్రీడాకారులు సంస్థలో పని చేస్తున్న యువ ఉద్యోగులను, క్రీడలకు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాక శారీరక దృఢత్వానికి సైతం తోడ్పడతాయని తెలిపారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారన్నారు. ఈకార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అల్విన్ కాలనీ డివిజన్ లో పెండింగ్లో ఉన్న పనులకు త్వరలో నిధులు మంజూరు..

### కాలనీ వాసులకు హామీ ఇచ్చిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ చేయిస్తా..



**టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి**
124 అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని వెంకటపాపయ్య నగర్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జూపల్లి జనార్దన్ రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ లో పెండింగ్లో ఉన్న డ్రైనేజ్, సీసీ రోడ్ల నిత్మణ పనుల గురించి కార్పొరేటర్ తో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంకటపాపయ్య నగర్ కాలనీ లో త్రాగు నీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని అన్నారు. కాలనీ వాసులు కోరిన విధంగా కొంతమేర పెండింగ్ ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ, దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో నిధులు మంజూరు చేసి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, జీవన్ రెడ్డి, రాంచంద్ర రెడ్డి, వెంకటస్వామి గౌడ్, నరసింహులు, మహీందర్ రావు, దయాకర్, బాలాజీ, విక్కీ, తదితరులు పాల్గొన్నారు...



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
శుక్రవారం, 10-10-2025


# షీ టీమ్స్ తో మహిళలకు మరింత భరోసా

**ఇబ్బందులు ఎదురైతే షీ టీంను సంప్రదించాలి**
**రామగుండం పోలీస్ కమిషనర్**
**అంబర్ కిషోర్ ఝూ**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:- రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిదిలోని మహిళలు, బాలికలు, విద్యార్థిని విద్యార్థుల భద్రతే షీ టీం లక్ష్యంగా పనిచేస్తునట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ప్రకటనలో తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయని షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలల, పాఠశాలలు, కళాశాలలో ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్,బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయాల్ 100, టి సేఫ్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ లలో సైతం ఫిర్యాదులు స్వీకరిస్తున్నారన్నారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు, సైబర్ నేరగాళ్లపై సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచిస్తూ, ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సేవలు అందిస్తామని తెలిపారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు



అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన, మాట్లాడిన విద్యార్థినిలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386, మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ లలో సందేశం పంపించి లేదా డయల్ 100 కు ఫోన్ చేసి, తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ కి మొత్తం 66 పిర్యాదులు రావడం జరిగిందని. ఈ 66 ఫిర్యాదుల్లో 06 ఫిర్యాదులు నేరుగా షీ టీమ్స్ రామగుండం కార్యాలయాలకు (పెద్దపల్లి జిల్లా, మంచిర్యాల జిల్లా షీ టీమ్స్) అందాయన్నారు. ఒక్క ఫిర్యాదు వాట్సాప్ నెంబర్ లో అందిందని, 59 కేసులు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాయని వివరించారు. అదేవిధంగా 07 ఫిర్యాదుల్లో ఈ పెట్టీ కేసులు 1, కౌన్సెలింగ్ చేసినవి 4, సంబందింత పోలీస్ స్టేషన్‌కి రిఫర్ చేసినవి 1, తదుపరి విచారణలో ఉన్నవి 1 కలవని తెలిపారు. షీ టీమ్స్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పబ్లిక్ ప్రదేశాలు, పార్కులు, షాపింగ్ మాల్ ప్రాంతాల్లో డే కాయ్ ఆపరేషన్స్ నిర్వహించాయని, ఈ ఆపరేషన్ లో మొత్తం 59 మందినీ పట్టుకుని, ఈ పెట్టీ కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి, హెచ్చరించి పంపించడం జరిగిందన్నారు. ఈ 59 రెడ్ హ్యాండెడ్ కేసుల్లో ఈ పెట్టీ కేసులు 10 నమోదు కాగా, కౌన్సెలింగ్ చేసినవి 06, హెచ్చరించి విడిచిన కేసులు 43 కలవు అని తెలిపారు. షీ టీమ్స్ సెప్టెంబర్-2025 నెలలో పెద్దపల్లి జోన్ పరిధిలో 20, మంచిర్యాల జోన్ పరిధిలో 20, మొత్తం 40 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా షీ టీమ్స్ సెప్టెంబర్-2025లో పెద్దపల్లి జోన్ పరిధిలో 87, మంచిర్యాల జోన్ పరిధిలో 96
మొత్తం:183 హాట్‌స్పాట్లను సందర్శించారని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుకు నిరసనగా ఛలో బస్ భవన్ కార్యక్రమం..

**కో ఆర్డినేటర్ సతీష్ అరోరా ను ముందస్తు అరెస్ట్ చేసిన**
**కె పి హెచ్ బి పోలీసులు..**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన “ఛలో బస్ భవన్” ఉద్యమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా ని పోలీసులు ఆయన నివాసంలోనే ముందస్తు అరెస్ట్ చేశారు. సతీష్ ఆరోరా పాటు పార్టీ నాయకులు పాతూరి గోపీ, రాజేష్ రాయ్, దినేష్ నాయుడులను కూడా అరెస్ట్ చేసి, కె పి హెచ్ బీ పోలీస్ స్టేషన్ కు తరలించారు.ప్రజల సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తే హక్కును అణగదొక్కే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పార్టీ నాయకులు విమర్శించారు.ప్రజల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు...

## ఘనంగా బీజేపీ యువ నాయకులు దినేష్ కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు..**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ బీజేపీ యువ నాయకులు దినేష్ కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. అనంతరం రాజేశ్వరరావు దినేష్ కుమార్ ని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వదిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో 121 డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు,దుర్గా ప్రసాద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## శాస్త్రీయ విద్య సాధన కోసం పోరాడుదాం

**పి డి ఎస్ యూ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ పిలుపు**



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

శాస్త్రీయ విద్య సాధన కోసం ఉద్యమించాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో సిర్పూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యార్థులతో మీటింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యార్థులకు ఉపయోగపడే విధానాలను విద్యలో ప్రవేశపెట్టడం లేదని, కేంద్ర ప్రభుత్వం విద్యలో శాస్త్రీయంగా ఉన్న సైన్స్ పాఠ్యాంశాలను తొలగిస్తూ అశాస్త్రీయ పాఠ్యాంశాలను పెడుతూ విద్యార్థుల మెదళ్లను కలుషితం చేస్తున్నారని, ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశ నుండే నేర్చుకోవాలని, ప్రభుత్వ స్కూల్స్ లో మౌలిక సదుపాయాలు కల్పనకై విద్యకు అధిక సంఖ్యలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు సాయి కిరణ్, బండమీద అజయ్, మనోజ్ తదితదిరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సమస్యలు పరిష్కరించడంలో ‘మెదక్ జిల్లాకు ద్వితీయ స్థానం’

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ శర్మ చేతులమీదుగా అవార్డు అందుకున్న**
**కలెక్టర్ రాహుల్ రాజ్**



టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి

సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి ఈ నేపథ్యంలో... బెస్ట్ పెర్ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్, బెస్ట్ ,బెస్ట్ డిపార్ట్మెంట్ ఇన్ డిస్పోజల్ ఆఫ్ ఆర్టిఐ కేసెస్ మొదలగు ఏడు విభాగాల్లో పురస్కారాలను ప్రధానం చేశారు ఈ క్రమం లో.గవర్నర్ విష్ణు దేవ్ శర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మెదక్ జిల్లా ద్వితీయ అవార్డు ను అందుకున్నారు ఆర్ టీ ఐ దరఖాస్తు లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ... పెండింగ్ లేకుండ వ్యవహరిస్తున్నందుకు గాను బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ గా మెదక్ జిల్లా ఎంపీక అయిన సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఈ అవార్డు ను తీసుకున్నారు మెదక్ జిల్లా కి వివిధ అంశాల్లో అనేక అవార్డు లు వస్తున్నందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దిశా నిర్దేశం లో వివిధ శాఖల అధికారులు గా పని చేయడం గర్వం గా ఉందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపారు ఎప్పటికప్పుడు ఆర్ టీ ఐ దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలని... పౌరులు అడిగిన సమాచారాన్ని గడువు లోపల ఇస్తున్నారా... లేదా అని కలెక్టర్ రివ్యూ చేసేవారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు

## పాఠశాలలు, ఏ.టీ.సీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు, ఐ.టీ.ఐలలో కొనసాగుతున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు అదే ఆవరణలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు.ముఖ గుర్తింపు విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా ఉ హాజరు తీసుకున్నారా అని పరిశీలించారు. విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. డైనింగ్ హాల్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్,పనులను పూర్తి చేయించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం బోధన్ పట్టణం, నిజామాబాద్ నగరంలలో ప్రభుత్వ ఐ.టీ.ఐ లకు అనుసంధానంగా ప్రభుత్వం నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు.ఈ కేంద్రాలలో అందు బాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఇంకనూ అవసరం ఉన్న మౌలిక వసతుల గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## బిఆర్ఎస్, బిజెపిల ద్రోహం

హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించచడంపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎవరు చేయలేని సాహసం చేసిందని వ్యవసాయ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బిసి బిల్లును అడ్డుకున్నదే బిజెపి అన్నారు. బిజెపిని నిలదీయమాల్సిన అసవరం ఉందన్నారు. ఇంటింటికి తిరిగి కులగణనం చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల రూపొందించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ – బీజేపీ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీలకు న్యాయం జరగాలనిఅభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ చిత్తశుద్ధితో చట్టం చేసిందన్నారు. అడ్డుకున్నదే బిజెపి అన్నారు.

## కారుణ్య నియమకాలను పోగొడుతున్న గెలిచిన సంఘాలు




టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

సింగరేణిలో గతంలో ఈ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను 20 ఏళ్ల అనంతరం కష్టపడి కారుణ్య నియామకాల పేరుతో సాధిస్తే, మరల ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ యూనియన్లు వాటిని పోగొడుతున్నాయని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) కేంద్ర ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ లు ఆరోపించారు. గురువారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం భాజాప్తుగా కార్మికులు సర్ఫేస్ లో ఉన్నారని, ఐఈడి ప్రకారం తాము మెడికల్ ఇన్వాల్యుడేషన్ ఇవ్వలేమని గంటా పథంగా చెబుతున్న, ఆరు నెలలైనా సోయి లేక, యాజమాన్యంతో కుమ్మక్కై, మెడికల్ ఇన్వాల్యుడేషన్ ను అటకెక్కించే చర్యలకు పాల్పడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మొన్న లాభాల బాటలో కార్మికుల కడుపు కొట్టి, బారాన వచ్చేదాన్ని చారానా ఇచ్చిన సింగరేణిలో గెలిచిన సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టీయూసీ లు సప్పుడు చేయలేదని విమర్శించారు. అదేవిధంగా దసరా పీహెచ్డీ కోలిండియాలో అక్టోబర్ 3న ఇచ్చినా, సింగరేణిలో ఇప్పించడంలో గెలిచిన సంఘాలు పూర్తిగా విఫలమయ్యారన్నారు. గుర్తింపు కాల పరిమితి ముగుస్తున్న కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కార్మికుల సొంతింటి పథకం, కొత్త గనులు, కొత్త పనులు ఊసే లేదని ఆరోపించారు. పెరాక్విడ్ పై ఐటి తిరిగి చెల్లింపు కోలిండియాలో కార్మికులకు అధికారులకు, సింగరేణిలో అధికారులకు మాఫీ చేస్తున్న దానిని సింగరేణి కార్మికులకు మాత్రం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఇప్పించడం లేదన్నారు. సింగరేణిలో గెలిచిన సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టియుసి లు అది తెస్తాం, ఇది తెస్తాం అని అనడమే తప్ప తెచ్చింది శూన్యమని ఎద్దేవా చేశారు. కంపెనీ పాలసీ ప్రకారం వచ్చే జనరల్ అసిస్టెంట్ పదోన్నతులను, ప్రతి సంవత్సరం పెరిగే ఇంక్రిమెంట్లను తామే సాధించామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో లాగా వారి కల్లబొల్లి కబుర్లు వినే కార్మికులు ప్రస్తుతం సింగరేణిలో లేరని, అందరూ చదువుకున్న యువతరం ఉందని తెలిపారు. గెలిచిన సంఘాల అవినీతిని, యాజమాన్యంతో వారు పడుతున్న లాలూచీని కార్మికులు గమనిస్తున్నారని, వాటికి చరమగీతం పాడేందుకు కార్మికుల సిద్ధంగా ఉన్నారన్నారు. అధికార సంఘాలకు కర్ర కాల్చి వాత పెట్టే సమయం ఆసన్నమైందని, వచ్చే సింగరేణి ఎన్నికల్లో కార్మికులే చైతన్యవంతులై, వారికి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి లు పాల్గొన్నారు.

## టిజిఎస్ ఆర్టీసీ కూకట్ పల్లిలో లక్కీడ్రా స్కీమ్ విజేతల ప్రకటన..




ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతి అందజేసిన ఆర్ ఎం

**సుచరిత, కూకట్ పల్లి డిపో మేనేజర్ హరి**

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

టిజిఎస్ ఆర్టీసీ కూకట్ పల్లి రిజియన్ ఆధ్వర్యంలో దసరా పండుగ శుభ సందర్భం గా ప్రయాణికుల కోసం ప్రత్యేక లక్కీ డ్రా స్కీమ్ ను సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వ తేదీ వరకు ప్రకటించారు. ఈ లక్కీ డ్రా స్కీమ్ ను ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ ఎం సుచరిత, కూకట్ పల్లి డిపో మేనేజర్ హరి చేతుల మీదుగా ప్రశాంత్ నగర్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో లక్కీ డ్రా ద్వారా ముగ్గురు విజేతల ను ప్రకటించారు. ఇందులో భాగంగా విజేతల నగదు బహుమతులను విజేతల వివరాల ను ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ ఎం సుచరిత ప్రకటించారు.సెప్టెంబర్ 27 నుండి అక్టో ప్రయాణించిన మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ ఎ .సి బస్సులో ప్రయాణించిన ప్రయాణికులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగింది.ప్రథమ బహుమతి .ఎస్ రమణ చారి, రాంపల్లి కీసర రూ! 25000,ల నగదు బహుమతి,ద్వితీయ బహుమతి గౌతమ్ రాజ్, ఘట్కేసర్ రూ! 15000 నగదు బహుమతి తృతీయ బహుమతి సుజాత 10,000 రూపాయలు నగదు బహుమతి ని, ప్రయాణికులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఆర్ ఎం ఓ అపర్ణ కళ్యాణి, డిప్యూటీ ఆర్ఎం ఎమ్ చౌహన్, కూకట్ పల్లి డిపో మేనేజర్ హరి, జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు, మియాపూర్ డిపో మేనేజర్ వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మెకానికల్ ఇంజనీరింగ్ బాలరాజు, ఉద్యోగస్తులు, ప్రయాణికులు, వెల్ఫేర్ కమిటీ లక్ష్మీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

TIMES OF VARTHA (10-10-2025)M_times of varha main (13-2).qxd 10/10/2025 6:14 AM Page 5



## సహ చట్టం పై అవగాహన కలిగి ఉండాలి...

### సహా చట్టం దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి...

### సబ్ కలెక్టర్ వికాస్ మహతో...



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు.మాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాచార హక్కు చట్టం గురించి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం - 2005 ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నదని అన్నారు.సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని చట్టం ద్వారా ప్రయోజనం పొందాలన్నదే సమాచార హక్కు చట్టం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు.సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ప్రజలకు కనిపించే విదంగా ఉండేలా చూడాలని అన్నారు. ఎవరైనా సమాచారం కోసం దరఖా స్తు చేసుకున్న 30రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలు శాఖల పిఐఓ లు ఏపిఐవో లు పాల్గొన్నారు.

## చల్లారిన రాజకీయ వేడి.



### చింతకాని మండలంలో ఎన్నికల హడావిడి సద్దుమణిగింది

టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని

చింతకాని మండలంలో ఎగిసిపడిన రాజకీయ ఉత్సాహం ఇప్పుడు సడెన్‌గా చల్లారిపోయింది. మండలాల్లో రాజకీయ నాయకులు ఒక్క సారిగా శాంతించినట్లుగా కనిపిస్తున్నారు. పొత్తులు, ఎత్తులు,అభ్యర్థుల ఎంపికల పై మల్లగుల్లాలు పడిన రాజకీయ నేతల హడావిడి,వర్షం వచ్చి ఆగినట్టుగా తక్షణమే క్షీణించింది.

### ఎన్నికల వాతావరణం మూగబోయింది .

మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఉత్సాహంగా సాగిన ఎన్నికల చర్చలు,వ్యూహ రచనలు,సభా చట్రాలు ఒక్క సారిగా రాజకీయ వాతావరణం మూగబోయింది. హమ్మయ్య, భలే పని అంటూ కొందరు ఊపిరి పీలుస్తుండగా, మరికొందరు మాత్రం ఇంత లోనే ఉత్సాహం ఆగిపోవడం బాధకరం అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

### కోర్టు స్టే ప్రభావం..

ఎన్నికల ప్రక్రియపై కోర్టు విధించిన స్టే కారణంగా రాజకీయ వేడి తాత్కాలికంగా చల్లారిపోయింది. కనీసం నెలరోజుల పాటు ఈ హడావిడి కి బ్రేక్ పడినట్లే అయింది. పక్షానికీ, ప్రతిపక్షానికీ ఇది అనూహ్య విరామం లాంటిదిగా మారింది.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



జిల్లాలోని కాసీపేట మండలం పెద్దనపల్లి నాయకపు గూడెం గ్రామ శివారులోని సుద్ద వాగు ఒడ్డున గురువారం గుర్తు తెలియని మగ మనిషి మృత దేహం కుళ్ళిపోయిన స్థితిలో లభించిందని కాసీపేట ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లా డుతూ, మరణించిన వ్యక్తి వయస్సు సుమారు 40 సంవత్సరాల వరకు వయస్సు కలిగి ఉండి, ఐదు ఫీట్ల ఆరు ఇంచుల పొడవు కలిగి ఉంటాడ న్నారు. మృతుని శరీరంపై నీలం రంగుతో కూడిన డబ్బాలు కలిగిన ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. అదేవిధంగా మృతిని కుడి చేతికి కడియాలు కలవన్నారు. పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. లభించిన ఆనవాళ్లను బట్టి మృతుడు సుమారు ఐదు రోజులు క్రితం నీళ్లలో పడి చనిపోయి ఉండవచ్చునని అభిప్రాయ పడ్డారు. కాసీపేట, బెల్లంపల్లి మండలాల గ్రామాలకు చెందిన వ్యక్తులు ఎవరైనా కనబడకపోయినా, మృతదేహాన్ని చూసి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8712656571 నకు ఫోన్ చేయాలని తెలిపారు.

## ఎడపల్లిలో బిఆర్ఎస్ పార్టీలోకి 100మంది చేరిక...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా,ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన సుమారు 100మంది వీరముష్టి సంఘం సభ్యులు గురువారం నాడు భారీ సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.మాజీ ఎంపీపీ శ్రీనివాస్,మండల అధ్యక్షుడు దేరెడి శ్రీరామ్ సమక్షంలో వీరు పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి ఆహ్వానించారు.ఈసందర్భంగా నాయకులు వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడుతూ.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి సాధ్యమైందని స్పష్టం చేశారు.బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీలకు చెందిన యువకులు, వివిధ సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో సైతం మండలంలోని అన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు.ఈ చేరిక ఎడపల్లి మండలంలో బిఆర్ఎస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ బాబా, మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, సదానంద్, శ్రీనివాస్,బాబర్,లాయక్,వీరముష్టి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రహ్లాద్ మరణం మున్సిపల్ కుటుంబానికి అపార నష్టం

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

మున్సిపల్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించి, మున్సిపల్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపునకు దారి చూపిన మహోన్నత నాయకుడు ప్రహ్లాద్ మరణం మున్సిపల్ కుటుంబానికి అపార నష్టమని పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రహ్లాద్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఏప్రిల్ 1, 2009 నుండి 010 జీతాల సాధనలో ప్రహ్లాద చూపిన నిబద్ధత, పోరాట స్ఫూర్తి, ఆయన తన సహ ఉద్యోగుల పట్ల చూపిన అనురాగం, అందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ లో తాను జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రహ్లాద నాయకత్వంలో నిర్వహించిన పోరాట కార్యక్రమాలలో పాలుపంచుకున్నానని గుర్తు చేశారు. మున్సిపల్ ఉద్యమ చరిత్రలో ప్రహ్లాద్ చిరస్మరణీయంగా నిలిచి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, రెవెన్యూ అధికారి పి కృష్ణ ప్రసాద్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఈ వసంత్, సీనియర్



అసిస్టెంట్లు ఏ రాణి, ఈ రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్లు పున్నమి చందర్, విమల రాణి, జూనియర్ అకౌంటెంట్ వెంకటేష్, శ్రీకర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్స్ అన్నం సాయి నిఖిల్, ఎం మనోజ్ కుమార్, భుక్య రాజ్ కుమార్, డేటా ప్రాసెసింగ్ అధికారి బి శ్యాంబాబు, ఇంచార్జ్ టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఏ రఘురాం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులు మిఠాయిలు అందజేయాలి




టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

సింగరేణి యాజమాన్యం గతంలో కార్మికులకు ఇచ్చిన విధంగా దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రతి కార్మికునికి స్వీట్ బాక్స్ అందజేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని శ్రీరాంపూర్ లో గల యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో ఇచ్చే స్వీట్ బాక్స్ లను కరోనాను సాకుగా చూపెట్టి, కరోనా సమయంలో నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ దీపావళి పండుగ నుండి స్వీట్ బాక్స్ ఇచ్చే కార్యక్రమం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి, సర్కారు, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీ లు కార్మిక పక్షాన యాజమాన్యంతో మాట్లాడి, స్వీట్ బాక్స్ ఇప్పించాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో గెలిచిన సంఘాలు తమ మేనిఫెస్టోలో పెట్టిన ముఖ్యమైన డిమాండ్ లలో సొంతింటి పథకం, అలవెన్స్ లపై ఐటి మాఫీ, మారు పేర్ల సమస్యను కాలయాపన లేకుండా పరిష్కరించి, కార్మికులకు దీపావళి కానుకగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకే 1ఏ గని పిట్ కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి





టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పులాంగ చౌరస్తా వద్ద డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పై న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు కాలును విసరటాన్ని ఖండిస్తూ రాకేష్ కిషోర్ పై చట్ట ప్రకారం అరెస్టు చేసి కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి ప్రజాస్వామ్యం పై జరిగిన దాడి మాత్రమే కాదు జస్టిస్ పై దాడి చేసిన లాయర్ రాకేష్ కిషోర్ సనాతన ధర్మానికి అన్యాయం జరిగితే సహించేది లేదని ప్రకటించడం ప్రజాస్వామ్య లౌకిక విలువలు కలిగిన రాజ్యాంగంపై దాడిగా చూడాలన్నారు. ప్రజాస్వామిక వాదులు దేశవ్యాప్తంగా ఈ దాడిని ఖండించిన కూడా దేశ ప్రధాని నరేంద్ర మోడీ గాని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కానీ ఇప్పటివరకు మాట్లాడకపోవడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. మనువాద సిద్ధాంతం కలిగిన బిజెపి రాజ్యాంగాన్ని గుర్తించడానికి సిద్ధపడటం లేదు అనేదానికి ఈ ఘటనే నిదర్శనం అన్నారు. భారత రాజ్యాంగానికి అనుగుణంగా రూపొందించిన న్యాయ సూత్రాలను అమలు జరిపే చేయటమంటే భారత రాజ్యాంగాన్ని, లౌకిక భావాలను, పౌరుల హక్కులను, దేశ సార్వభౌమత్వాన్ని కించపరచడమే అవుతుందని ఆయన విమర్శించారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా ఇదే పద్ధతుల్లో దాడులు చేస్తామని హెచ్చరించటం అంటే ఈ దేశంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ రాసిన భారతర రాజ్యాంగం పై చేస్తున్న దాడి కుట్రలో భాగంగానే ఈ దాడి జరిగినట్లు ఆయన అన్నారు. దాడి చేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకొని శిక్షించినప్పుడే భారత రాజ్యాంగం పైన సరైన నమ్మకం ప్రజలకు కలుగుతుందని ఆయన అన్నారు.ఇంతటి దుశ్చర్యకు పాల్పడినప్పటికీ న్యాయశాఖ మంత్రి కానీ, ప్రధానమంత్రి కానీ ఈ ఘటనపై మాట్లాడకపోవడం వారి ఆలోచన విధానాన్ని తెలియజేస్తుందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యం పైన నమ్మకం ఉంటే వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య దర్శి ఏ. రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు, పి. వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు వై. గంగాధర్, నన్నే సాబ్, సుజాత, నాయకులు సాయిలు, మోహన్, సిర్పలింగం, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్న సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు

### చనిపోయిన కార్మికుని భార్యకు వెంటనే పెన్షన్ ఇవ్వాలి

### సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం





టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-.

సింగరేణిలో విధులు నిర్వహించి, మరణించిన కార్మికుని భార్యకు రావాల్సిన కోల్ మైన్స్ పెన్షన్ ఇవ్వకుండా సింగరేణి, సీఎంపిఎఫ్ అధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని, వెంటనే చనిపోయిన కార్మికుని భార్యకు పెన్షన్ ఇవ్వాలని సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని మారుమూల గ్రామానికి చెందిన పుల్యాల ఓదెలు శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1 గనిలో ట్రామర్ గా విధులు నిర్వహించి, అనారోగ్యంతో 2001లో గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకంలో పదవి విరమణ పొంది, సెప్టెంబర్ 27, 2024న అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. ఓదెలు మరణించి, సంవత్సరం కావస్తున్న అతని భార్య పుల్యాల ఓదెమ్మకు రావలసిన విడో పెన్షన్ నేటికీ రావడం లేదన్నారు. పెన్షన్ కొరకు ఓదమ్మ శ్రీరాంపూర్ సింగరేణి అధికారులకు దరఖాస్తు పెట్టుకొని, 5,6 నెలలు గడుస్తున్నా పెన్షన్ మంజూరు చేయక, కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఆమె భర్తకు సంబంధించిన ఫైల్ ఎక్కడో ఉన్నదని, ఆ ఫైల్ దొరకడం లేదని సంబంధిత అధికారులు, సిబ్బంది చెప్పడంతో ఓదమ్మ కన్నీటి పర్వతమయ్యి సంఘాన్ని ఆశ్రయించిందన్నారు. దరఖాస్తు పెట్టుకొని ఐదారు నెలలు గడుస్తున్న ఓదమ్మ కు పెన్షన్ మంజూరు చేయకుండా తిప్పించుకోవడం భావ్యం కాదని, వెంటనే ఆమెకు కోల్ మైన్స్ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఓదమ్మ కు ఎలాంటి భూములు, ఆస్తులు లేవని, పెన్షన్ మీదనే ఆధారపడి బతుకుతుందని తెలిపారు. ఓదమ్మ కు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని, లేని పక్షంలో శ్రీరాంపూర్ ఏరియా జిఎం కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## లోకేశ్‌ను కలిసిన నంబూరి కుటుంబ సభ్యులు

అమరావతి: తెదేపా కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పాల్వాయిగేట్ ఈవీఎం ధ్వంసం ఘటనలో తెదేపా నేత నంబూరి శేషగిరిరావు గట్టిగా పోరాడి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. నంబూరి శేషగిరిరావు ఇటీవల గుండెపోటుతో మరణించిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు గురువారం నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో వైకాపా నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే నంబూరి శేషగిరిరావు ఎదురు తిరిగి పోరాడిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి నారా లోకేశ్ పిలిపించుకుని మాట్లాడారు. కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
శుక్రవారం,
10-10-2025


# బిఎల్‌టియు రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

ఈనెల 11, 12 తేదీలలో నిజామాబాదు జిల్లా కేంద్రంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ రెండవ రాష్ట్ర మహా సభలను జయప్రధం కోసం భోదన్ తాలుక, కోటగిరి, మండలం, ఎత్తోండ, బీడీ కార్మికులతో గోడ ప్రతులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమకు పుట్టినిల్లు అయిన నిజామాబాదు జిల్లా కేంద్రంలో "తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ" రాష్ట్ర 2వ మహా సభలు, నిర్వహించడం జరుగుతుందన్నారు.
మొదటి రోజు ఈనెల 11న మధ్యాహ్నం1గంటకు తిలక్ గార్డెన్ నుంచి భారీ ర్యాలి పాత కలెక్టర్ కార్యాలయం వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2గంటలకు పాత కలెక్టర్ కార్యాలయం గ్రౌండ్ లో "బహిరంగ సభ" ఉంటుందన్నారు. రెండవ రోజు 12న నిజామాబాదు తిలక్ గార్డెన్ న్యూ అంబేద్కర్ భవనంలో ప్రతినిధుల మహా సభ, ఉదయం 10గంటలకు ప్రారం అవుతుందన్నారు. మొదటి రోజు బహిరంగ సభకు ముఖ్య అతిథిగా గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఇన్ చార్జి మంత్రి సీతక్క, అతిధులుగా నల్ల సూర్య ప్రకాష్, బిఎల్ ఎఫ్ చైర్మన్, దండి వెంకట్ బిఎల్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్, జయరాజ్, పకృతి కవి, రచయిత ఏపూరి సోమన్న, బహుజన యుద్ధ నౌక, జుపక, సుభద్ర కవి, రచయిత,వక్తలు దండి వెంకట్, బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు, యం. ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగరపు యెల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్. డి. స్తైయ్యద్, రాష్ట్ర కోషదికారి, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, సబ్బని లత, బహుజన లెఫ్ట్ మహిళ సంఘం, రాష్ట్ర అధ్యక్షురాలు, మంత్రి సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుడ్ల రాజు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు, బాస్కర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, బి. జగదీష్, నిజామాబాదు జిల్లా అధ్యక్షుడు, చట్ల పొశవ్వ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, కే. హరి జిల్లా అధ్యక్షుడు, బి. నర్సిములు జిల్లా కార్యదర్శి, సిద్దిపేట జిల్లా గంగా మణి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రవి, కామారెడ్డి జిల్లా కార్యదర్శి, యం. ప్రభాకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, రోహిణి, మెదక్ జిల్లా అధ్యక్షురాలు, యం. రాజేంద్రర్, బిఎల్ టీయూ నిజామాబాదు జిల్లా అధ్యక్షుడు, సి. హెచ్. రాజు సిరిసిల్ల జిల్లా కార్యదర్శి, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, వడ్ల సాయి కృష్ణ, బిడియస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, తదితరులు ఈ సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కోషదికారి యస్. డి. స్తైయ్యద్, టేకేదార్ యూనియన్ నిజామాబాదు జిల్లా నాయకులు, మారుతి, ఎత్తోండ బీడీ కార్మికులు, లక్ష్మి, శారద, అనిత, నికిత, అంజలీ, షహిని తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తైక్వాండో బృందం ఖరారు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్

తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల ఎస్ జి ఎఫ్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలకు నిజామాబాద్ జిల్లా బృందం ఖరారైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల డి.ఎస్.ఎ స్విమ్మింగ్ ప్రాంగణంలోని హాల్ లో జిల్లా స్థాయి అండర్ - 14 బాలబాలికల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న బాల బాలికలను ఆయా వ్యక్తిగత శరీర బరువు కేటగిరిలలో విభజించి ప్రతిభ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా బృందానికి ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా బృందం ఈనెల 10న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల బసవ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు.

# బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహానేత కాన్షీరాం



బిఎస్పీ ఆధ్వర్యంలో కాన్షిరాంకు ఘన నివాళులు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

బహుజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత కాన్షీరాం అని బీఎస్పీ రాష్ట్ర మాజీ జోనల్ కోఆర్డినేటర్ కత్తుల కాన్షీరాం తెలిపారు.బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో గురువారం బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై,పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్‌తో కలిసి కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి,నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సెమినార్లో ఆయన మాట్లాడుతూ,కాన్షీరాం సిద్ధాంతాలు సమాజంలో సమానత్వం,న్యాయ స్థాపనకు మార్గ దర్శకాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు,బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దాగం శ్రీనివాస్,జిల్లా నాయకులు బూడిద మల్లేష్, చెన్నూరు నియోజవర్గ నాయకులు ఎండి మాతిన్ ఖాన్,మందమర్రి పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్,మందమర్రి మండల అధ్యక్షుడు ఎస్కే రహీం బాబా లు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీఈవో గడియారం శ్రీహరి, ల్యాండ్ ఆక్రేషన్ డిటి స్వప్న రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అరుణ, రిటైర్డ్ తహశీల్దార్ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

# టేకు చెట్ల దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్

గోపాల్ శ్రీధర్ అనేవ్యక్తి మాక్లూర్ మండల మెట్పల్లి గ్రామపరిధిలో గల మామిడితోటలో 20 టేకుచెట్లు గుర్తుతెలియనిదొంగలు నరికి తీసుకెల్లారని ,ఆగస్టు 19. 2025 తేదీన మాక్లూర్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు.అట్టి విషయమై దర్యాప్తు చేపట్టగా, గురువారం కేసుకు సంబందించిన జావెద్, మహమ్మద్ అబ్బాస్ లను అరెస్ట్ చేసి,వారి వద్దనున్న 94 వేల రూపాయల విలువగల టేకు దుంగలు, దుంగలుగల వాహనాన్ని స్వాదినపరుచుకొని, కోర్టులు ఆహాజరు పరిచామని, నార్తు రూరల్ సి ఐ శ్రీనివాస్,మాక్లూర్ ఎస్ ఐ రాజశేఖర్ తెలియజేశారు. ఇట్టి కేసు చేదించడంలో ప్రతిభ చూపిన ఐడి పార్టీ సిబ్బంది రాజేశ్వర్, రాజారెడ్డి, రాకేష్, చందు, లను ఏసీపీ రాజావెంకట్ రెడ్డి అభినందించారు.



# బాన్సువాడలో బారాస నాయకుల ముందస్తు అరెస్ట్

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచడానికి నిరసిస్తూ బారాస పార్టీ హైదరాబాదులో బస్సు భవన్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టింది. దీనికి ముందస్తుగా బాన్సువాడకు చెందిన బారాసా నాయకులను పోలీసులు బుధవారం రాత్రి 3: 30 బుధవారంనిమిషాలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో బారాస నియోజకవర్గ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ తో పాటు డాక్టర్ దుద్దాల అంజిరెడ్డి, గాండ్ల తేలి ఉమా మహేష్ కుమార్, గాండ్ల కృష్ణ, ఆటోమొల, గౌస్, రమేష్ యాదవ్, సమీర్ ఖాన్, చాకలి సాయిలు, బోద రామ్ చందర్,తదితరులు, ఉన్నారు.



# స్థానిక ఎన్నికల దృష్ట్యా బీఆర్ఎస్-సీపీఎం ఒప్పందం

టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని



చింతకాని మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్-సీపీఎం పార్టీలు పరస్పర అవగాహనకు వచ్చాయి. సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇరు పార్టీల నాయకులు పాల్గొని చర్చలు జరిపారు. చర్చల్లో జడ్పీటీసీ స్థానం బీఆర్ఎస్‌కు, ఎంపీపీ పదవి సీపీఎంకు కేటాయించే విధంగా నిర్ణయం తీసుకున్నారు.ఇరు పార్టీల జిల్లా, మండల స్థాయి నేతలు పాల్గొని ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపారు. ఈ అవగాహనతో స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్-సీపీఎం కలయికగా బలమైన సమీకరణ ఏర్పడిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# శంకర్ గౌడ్ తో సమావేశమైన జిల్లా జనసేన పార్టీ నేతలు




టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

టిటిడి ఎల్ఏసి హిమాయత్ నగర్ టిటిడి చైర్మన్ గా నియమితులైన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తో గురువారం జిల్లాకు చెందిన పలువురు జనసేన పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ చెన్నూరు నియోజకవర్గానికి చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకుడు ఆవుల సాగర్, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకుడు రొడ్డ శేఖర్ లు శంకర్ గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీకి సిద్ధమని స్పష్టం చేశారు. హైకోర్టు స్టే తో ఇంకా సమయం ఉన్నందున క్షేత్రస్థాయిలో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషిచేసి, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని మీన గార్డెన్స్ లో దామరంచ వాస్తవ్యులు మహబూబ్ కుమార్తె వివాహానికి గురువారం నాడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి.ఈ వివాహ వేడుకలో దామరంచ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి వెంట ఉన్నారు.



# బీసీ రిజర్వేషన్ అడ్డుకున్నది బిజెపి, బీఆర్ఎస్‌లే

గవర్నర్ వద్ద, పార్లమెంట్ లో అడ్డుకున్నది బిజెపి

కోర్టులో కేసు వేసి అడ్డుకున్నది బిఆర్ఎస్

ఈ రెండు ప్రతిపక్ష పార్టీల నాటకాన్ని ప్రజల ముందు ఉంచుతాం

బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒకటే అని ప్రజలకు చెప్తాం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైకోర్టు తీర్పు అనంతరం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నప్పటికీ భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి పార్టీలు అడ్డుకుంటున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ ఆరోపించారు. హైకోర్టు తీర్పు అనంతరం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున మేం బలమైన వాదనలు వినిపించామని, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇలా మధ్యంతర స్టే విధిస్తుందని అనుకోలేదన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీ అందిన తర్వాత ఏం చేయాలనేది నిర్ణయిస్తామని షబ్బీర్ అలీ అన్నారు. మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. బీసీ 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల సర్వేలు నిర్వహించిందని, కృత నిశ్చయంతో వన్ మెన్ కమిషన్ వేసిందన్నారు. కేబినెట్ ఆమోదం కూడా తెలిపిందని, శాసన సభలో చట్టం చేసి గవర్నర్ కు పంపించాం అన్నారు. అదేవిధంగా 2018 పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేశామని, తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలు చేస్తున్న విధంగా ఇక్కడ కూడా చేస్తాం అని షబ్బీర్ అలీ వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్రం నుంచి నిధులు రావడం లేదని, గ్రామాలను అభివృద్ధి చేయలేకపోతున్నాం అన్నారు. కాంగ్రెస్ హ యాంలో సామాజిక న్యాయం జరుగుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టు ఉ ందన్నారు. జీవో 9 ముందుకు వెళుతుంటే కోర్టులో అడ్డుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తరపున కోర్టులో బలంగా వాదనలు వినిపిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు ఇంప్లీడ్ కాలేదో ప్రజలకు జవాబు చెప్పాలని అన్నారు. వీరి నాటకాన్ని ప్రజల ముందు ఉంచు తామని, బిజెపి, అని ప్రజలకు చెప్తాం అని తేల్చి చెప్పారు. 42 శాతంతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తాం అని స్పష్టం చేశారు. కోర్టులో ఇంకా గట్టిగా వాదన వినిపించి 42 శాతానికి అను కూలంగా తీర్పు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్ కు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని స్పష్టత ఇచ్చారు.

TIMES OF VARTHA (10-10-2025)M_times of varha main (13-2).qxd 10/10/2025 6:14 AM Page 7



# అమెరికా, భారత్ మధ్య ఆర్థికవృద్ధికి సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)..



అవసరం లేదనీ, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ ప్రపంచ నగరంగా అందరినీ ఆకర్షిస్తోందనీ, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోందనీ, ఇక్కడ మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని ఆయన అన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందనీ, 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని చెప్పారు. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి వారికి తెలిపారు. హైదరాబాద్‌లో గేమ్ ఛేంజర్ ప్రాజెక్టులు చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి పొరుగున ఉన్న ఏపీలో మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఉండేలా రవాణా సదుపాయాలు విస్తరిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ నుంచి చెన్నై వరకు, హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నాయన్నారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టామనీ, సిటీలో ఇప్పుడున్న మెట్రో రైలును అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త మార్గాలను తెరుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. 30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్న ట్టు సీఎం తెలిపారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయనీ, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలనీ, ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'చైనా ప్లస్ 1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందనీ, అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని అన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచనలున్నాయని తెలిపారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఇప్పటికే పేరొందిన కంపెనీలు హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ ఏర్పాటు చేశాయనీ, వీటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె. శశాంక, ఇండిస్టిస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా ప్రతినిధి బృందంలో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి, వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్ వేవ్ క్యాపిటల్ పార్టనర్స్ సీఈవో మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు రావెనెల్ కర్రీ, బిల్లింగ్స్లి కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్‌తో పాటు మొత్తం 16 మంది ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారధ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలను స్వీకరిస్తోంది.

# మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

### ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం

టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ:



బాన్సువాడ ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం జరిగింది. నాయకులు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యత కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు కాన్షీరామ్. ఆయన పోరాట ఫలితంగానే ఉత్తరప్రదేశ్‌లో బహుజన శక్తి అధికారంలోకి వచ్చింది. దేశవ్యాప్తంగా బహుజన రాజ్యం రావాలని కోరుకున్న తొలి నాయకుడు ఆయన అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గైని రవి, బాన్సువాడ డివిజన్ ఉపాధ్యక్షుడు మన్నే చిన్న సాయిలు, దేశాయిపేట అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు న్యాల కంటి గంగాధర్, మాల మహానాడు నాయకులు వాగ్మారే మారుతీ ఆర్టీసీ, దుర్కి సక్కి సురేష్ తదితరులున్నారు.


# ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం డ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)..



రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మీ డ్రామాలు ఆపాలని.. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలని.. ద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుందని.. ఢిల్లీని నిలదీస్తుందన్నారు.

# ఆశావాహుల ఆశలు గల్లంతు?


TELANGANA STATE ELECTION COMMISSION
1st Floor, DTCP Building, Opp: PTI Building, A.C. Guards, Hyderabad – 500 004.

PRESS NOTE

DATE: 09.10.2025

The State Election Commission will abide by the directions issued today by the Hon'ble High Court.

Secretary

(మొదటి పేజీ తరువాయి)..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు రాష్ట్ర ప్రాల్లో అనుమానాలను రెకెత్తిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ వివాదం మొదటినుండి ప్రారంభమై స్థానిక సంస్థల ఎన్నికల వేగం.. ప్రతి నిర్ణయం చట్టపరమైన అవగాహన లోపాన్ని బయట పెట్టిందని రాజకీయ సెఫాలజిస్టులో అభిప్రాయపడుతున్నారు. న్యాయ సూత్రాలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తెలిసి కూడా, వాటిని నిర్లక్ష్యం చేయడం,పార్టీ లో ఉన్న మేధావులతో పాటు అధికారులపై కూడా కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నలు లెవనేత్తుతు న్నారు. నాయకులు ప్రతిపక్షాలపై చేసే విమర్శల కంటే తీసుకునే చర్యలలో చట్టబద్ధతను కాంగ్రెస్ క్యాడర్ కోరుకుం టుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో చిత్తశుద్ధి కనిపించకపోతే భవిష్యత్తులో పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని నెమ్మదిగా కోల్పోతుందని, ప్రజాభిప్రాయం ఓటు కంటే గొప్పది. అది ఒకసారి దెబ్బతింటే మళ్ళీ సంపాదించుకోవడం కష్టతరమని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ను ఒంటరిగా చేస్తుందా నామానాలు రేకిస్తున్నాచట్టాల పట్ల నిర్లక్ష్యం, ప్రజా అభిప్రాయాన్ని పట్టించుకోకపోతే ఏ ప్రభుత్వానికైనా దీర్ఘకాలిక ప్రమాదం. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పాఠం ఇప్పుడైనా నేర్చుకోకపోతే మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా న్యాయానికి విరుద్ధమైన నిర్ణయాలకే ప్రజలు వారి తీర్పును వెలువరిస్తాయ న్న విషయాలను కాంగ్రెస్ నాయకులు మరువరాదని హెచ్చరిస్తున్నారు..

# హైకోర్టు వద్ద బిసి సంఘాల నేతల ఆందోళన

### సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు




హైదరాబాద్: బిసి రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించడంతో హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ కోర్టు వద్ద బీసీ సంఘాలు నేతలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే బీసీలకు అన్యాయం జరిగింది అని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. బీసీలకు పదవులు వస్తుంటే అగ్రకులస్తులు ఓర్వలేకపోతున్నారు అని వారు మండిపడ్డారు. బీసీల నోటి కాడ ముద్దను లాక్కున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పదవులు మొత్తం అగ్రవర్ణాలకే. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులైనా బీసీలకు దక్కొద్దా..? అని ప్రభుత్వాన్ని బీసీ నేతలు నిలదీశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. జీవో అమలును నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు 2 వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు కోర్టు వాయిదా వేసింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై రెండు రోజుల పాటు హైకోర్టులో సుధీర్ఘ విచారణ కొనసాగిన సంగతి తెలిసిందే. ఏజీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ బీసీ జనగణన నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 57.6 శాతం ఉందని ఆయన పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఏజీ తెలిపారు. ఈ తీర్మానం సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైన అడుగని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపకపోయినా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అది చట్టబద్ధమైనదే అని ఏజీ పేర్కొన్నారు.

# సర్కార్ నడవట్లేదు..సర్కస్ నడుపుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)..



చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వివేకానంద గౌడ్, శంభీర్ పూర్ రాజు, సాయిబాబా తదితరులను కూడా గృహనిర్బంధం చేశారు. ఇక మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని చలో బస్ బవన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా... బీఆర్ఎస్ బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎంపి అర్వింద్ వ్యాఖ్యలపై బొంతు స్పందన

### తాను బిజెపితో టచ్‌లో లేనని స్పష్టీకరణ



హైదరాబాద్ :బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిగా.. కాంగ్రెస్ నేత బొంతు రామ్మోహన్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ విషయం తాజాగా.. బొంతు రామ్మోహన్ స్పందించారు. ఎంపీ అర్వింద్ మాటలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేస్తానన్న ప్రచారం అవాస్తవమని తేల్చిచెప్పారు. బీజేపీలో అంతర్గత చర్చకు, తనకు ఎలాంటి సంబంధం లేదని కుండ బద్దలు కొట్టారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నాను.. ఉంటాను అని బొంతు రామ్మోహన్ స్పష్టం చేశారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ నేత బొంతు రామ్మోహన్ పేరును ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ అభ్యర్థిగా ప్రతిపాదించారు. బొంతు రామ్మోహన్‌ను పార్టీలోకి తీసుకుని జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని.. బీజేపీ చీఫ్ రామచందర్ రావును ఆయన కోరారు. రామ్మోహన్‌కు ఎబివిపి బ్యాక్‌గ్రౌండ్ ఉందని ఎంపీ అర్వింద్ తెలిపారు. ఈ నేపథ్యంలో స్పందించిన రామ్మోహన్ అదంతా ప్రచారమని తేల్చి చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9 అమలుపై హైకోర్టు స్టే విధించిన క్రమంలో తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఉన్నత న్యాయస్థానం నిర్ణయంతో బీసీల నోటి వద్ద ముద్ద లాగేసినట్లయిందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. బీసీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతామన్నారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. హైకోర్టు తీర్పు కాపీ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కేసులు వేయించింది భారత రాష్ట్ర సమితే. భాజపాతో కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది. హైకోర్టు స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించాం అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు హైకోర్టు స్టే విధించడంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు.

# చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

### 3కోట్లతో పోలీస్ జంప్

విశాఖపట్టణం : విశాఖలోని ఎండాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి కుటుంబం చీటీల పేరుతో జనానికి కుచ్చుటోపీ పెట్టింది. ఏకంగా రూ.3 కోట్ల జనం సొమ్ముతో కానిస్టేబుల్ అండ్ ఫ్యామిలీ జంప్ అయింది. దీంతో బాధితులు ఏం చేయాలో అర్థం కాక.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డివిజన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్య రవణమ్మ, కూతురుతో కలిసి ఎండాడలో ఉంటున్నారు. జగ్గారావు పోలీస్ కావడంతో.. అతని భార్య రవణమ్మ.. పోలీసమ్మ అవతారం ఎత్తింది. స్థానికంగా బాగానే పరిచయాలు పెంచుకుంది. అంతే కాదు 2019లో చీటీల వ్యాపారం షురూ చేసింది రవణమ్మ. లక్ష రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకు చీటీలు నడిపించేది. క్రమంగా చీటీల దందాలోకి జగ్గారావు కూడా దిగాడు. బంధువులు, చుట్టుపక్కల అపార్టుమెంట్లలో ఉండేవాళ్లు, చిన్న చిన్న ఉద్యోగులు, ఇళ్లల్లో పని చేసేవారు, వాచ్‌మెన్లు.. ఇలా ఎవరినీ వదలలేదు. అందరితో మంచి మాటలు కలిపి చీటీలు వేయించారు. జనాల లక్షలకు లక్షలు వసూలు చేశారు. మరోవైపు జనం కూడా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చీటీలు వేసుకుంటూ వచ్చారు..చాలా ఏళ్ల నుంచి నమ్మకంగా చీటీలు నడిపిన రవణమ్మ.. మొన్నటికి మొన్న రాత్రికి రాత్రి దుకాణం సర్దేసిరది. ఇళ్లు ఖాళీ చేసి జగ్గారావు, రవణమ్మ ఎక్కడికో వెళ్లిపోయారు. ఇల్లు తాళం ఉండే సరికి బాధితులంతా ఒక్కసారిగా షాకయ్యారు. తమ డబ్బులు పోయాయని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.. మరోవైపు జగ్గారావు, రవణమ్మ దంపతుల కొడుకు స్వరూప్ నెదర్లాండ్స్‌లో ఉండి కథ నడిపించాడని బాధితులు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు.. ఇంట్లో ఉన్న జగ్గారావు, రవణమ్మ కుమార్తెను అదుపులోకి తీసుకున్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# క్రికెటర్ సచిన్‌తో ప్రయాణం

## జీవితంలో మరవలేని అనుభూతి: తమన్



ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. సంగీతంతో ప్రేక్షకుల మనసు దోచుకుంటూనే, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ అభిమానులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ఉంటారు. తాజాగా తమన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన తనకు తారసపడిన అరుదైన క్షణాన్ని అభిమానులతో పంచుకున్నారు. డల్లాస్ నుండి దుబాయ్‌కు వెళ్తున్న సమయంలో తనతో కలిసి ప్రయాణించిన క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ గురించి ట్వీట్ చేస్తూ, ఆయనతో దిగిన ఫోటోను పోస్ట్ చేశారు. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ గారితో డల్లాస్ నుంచి దుబాయ్ వరకు ప్రయాణించడం గొప్ప అనుభవం. ప్రయాణ సమయంలో మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. సీసీఎల్ మ్యాచ్‌లలో నా బ్యాటింగ్ వీడియోలు చూపించాను. చూసిన వెంటనే సచిన్ 'నీ బ్యాట్ స్పీడ్ అద్భుతంగా ఉంది' అని ప్రశంసించారు. ఇది నా జీవితంలోని గొప్ప క్షణం. త్వరలోనే ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావొచ్చు' అంటూ తమన్ పేర్కొన్నారు.తమన్ చివరిగా 'త్వరలో కలిసి పని చేయొచ్చు' అనే వ్యాఖ్య నెటిజన్లలో ఆసక్తిని రేపుతోంది. దీనిపై సోషల్ మీడియాలో వివిధ ఊహాగానాలు వెలువడుతున్నాయి. 'సచిన్ సినిమాల్లో నటించనున్నారా?, తమన్ సచిన్ బయోపిక్‌కి సంగీతం అందించను న్నారా?, లేదా ఇద్దరూ ఏదైనా క్రికెట్ ప్రాజెక్ట్ కోసం కలవబోతున్నారా? అని అభిమానులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. తమన్ కేవలం సంగీత దర్శకుడిగానే కాకుండా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ లో తెలుగు వారియర్స్ తరపున క్రికెట్ ఆడుతూ తన బాటింగ్ టాలెంట్‌ను చూపించారు. చాలా మ్యాచుల్లో తన ఆటతో జట్టుకు విజయాన్ని అందించారు. ఇప్పుడు ఆయన బ్యాటింగ్ గురించి సచిన్ కూడా మాట్లాడటం తమన్‌కు మరింత గర్వకారణంగా మారింది. ఇటీవలే పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రానికి సంగీతం అందించి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా మార్చిన తమన్, ప్రస్తుతం 'అఖండ 2: తాండవం', ప్రభాస్ 'ది రాజా సాబ్' వంటి భారీ ప్రాజెక్టులకి పనిచేస్తున్నారు. 'ఓజీ'లో తమన్ సంగీతం సినిమా విజయానికి కీలక కారణమైందని దర్శకుడు సుజీత్ ప్రత్యేకంగా అభినందించిన విషయం తెలిసిందే.

# మహానటిలో ఎఎన్నార్ పాత్ర నా అదృష్టం

## నటుడు నాగచైతన్య వెల్లడి



'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉ ంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షూటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.

# చాలాకాలం తరవాత మళ్లీ తెర మీదకు సమంత

## మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు



స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రోడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షూటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.

# నాగశౌర్య కొత్త సినిమా బ్యాడ్ బాయ్ కార్తీక్

## టీజర్ విడుదల చేసిన మేకర్స్




నాగశౌర్య ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథతో దీనిని తెరకెక్కించినట్లు టీజర్ ఆధారంగా అర్థమవుతోంది. నటి పూర్ణ సీరియస్ లుక్‌లో కనిపించగా.. సాయి కుమార్ పోలీస్ పాత్రలో తనశైలిలో డైలాగ్ చెప్పారు. ఛలో సినిమాతో సూపర్ హిట్ అందుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ వచ్చిన నాగశౌర్య కొంత కాలంగా సైలెంట్ అయ్యాడు. చివరిగా 2023 లో రంగబలి అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆ సినిమా కూడా యావరేజ్ టాక్ తెచ్చుకుంది. దాంతో సినిమాలకు లాంగ్ గ్యాప్ ఇచ్చేసాడు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులని అలరించటానికి వస్తున్నాడు. నూతన దర్శకుడు రామ్ దేశిన దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఎప్పుడో ప్రకటించాడు శౌర్య. ఎప్పటినుండో సెట్స్ పై ఉన్న ఈ సినిమా టీజర్ ను ఈ రోజు రిలీజ్ చేసారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా బ్యాడ్ బాయ్ కార్తీక్ టీజర్ ను రిలీజ్ చేసారు. భార్గీ ÷ట్స్, రొటీన్ డైలాగ్స్ తో నింపేసారు. ఇక చివర్లో వెన్నెల కిషోర్ తో ఎదో కామెడీ అని ట్రై చేసారు. ఓవరాల్ గా చూస్తే బ్యాడ్ బాయ్ కార్తీక్ ఒక రొటీన్ కమర్షియల్ టీజర్ లానే అనిపిస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మరియు శ్రీదేవి విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా తమిల్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ హారిస్ జయరాజ్ సంగీతం అందిస్తున్నారు. నాగ శౌర్య కు జోడిగా వీధి హీరోయిన్ గా నటిస్తుండగా వైష్ణవి ఫిలింస్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు.




# గృహిణి అని గర్వంగా చెప్పండి

## నామోషీ పడాల్సిన పనిలేదన్న అమితాబ్

బాలీవుడ్ షహెన్‌షా అమితాబ్ బచ్చన్ మాటలంటే ఎంత స్పెషల్‌గా ఉ ంటాయో అందరికీ తెలిసిందే. తాజాగా కేబీసీ షోలో బిగ్‌బీ చెప్పిన మాటలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఓ కంటెస్టెంట్‌ని ఉద్దేశించి ఆయన.. చాలామంది మహిళలు 'నేను గృహిణిని' అని చిన్నగా అంటారు. కానీ ఇది చిన్న విషయం కాదు. గర్వంగా చెప్పండి! ఇంటి పనులు చూసుకోవడం, కుటుంబాన్ని కాపాడుకోవడం అంటే పెద్ద బాధ్యత' అని చెప్పడం అక్కడ ఉన్నవారినే కాదు, టీవీ ముందు చూసిన వాళ్లను కూడా ఇన్‌స్పైర్ చేసింది.ఇంకా ఆయన ఒక ఇంట్రెస్టింగ్ పాయింట్ షేర్ చేశారు. 'కోవిడ్ సమయంలో పురుషులు ఇంటి పనులు చేయాల్సి రావడం తో, గృహిణుల కష్టాలెంత కఠినమో అర్థమైంది' అన్నారు. బిగ్‌బీ చెప్పిన ఈ మాటలు వేదికపైనే చప్పట్ల వర్షం కురిపించాయి. నిజంగానే కదా.. మనం సాధారణంగా తీసుకునే 'ఇంటి పనులు' వెనుక అంత కష్టం, డెడికేషన్ ఉంటుందని ఆయన ఒక్క మాటలో చెప్పేశారు. అదే కాకుండా, ఇటీవల జరిగిన మహిళల క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌పై సాధించిన అద్భుత విజయాన్ని కూడా బిగ్‌బీ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'భారతదేశానికి వీళ్లు అతిపెద్ద సంపద' అంటూ ట్వీట్ చేశారు. ఇలా ఎప్పటికప్పుడు పాజిటివ్‌గా మాట్లాడే అమితాబ్ బచ్చన్ కామెంట్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.

# ద ప్యారడైజ్ ఇంటర్నేషనల్ మూవీ



## బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ ప్రకటన

న్యాచురల్ స్టార్ నాని 'ది ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దసరా హిట్ తర్వాత మళ్లీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో జతకట్టిన నాని ఈసారి భారీ స్థాయి ప్రాజెక్ట్ చేయనున్నాడు. సుధాకర్ చెరుకూరి ప్రొడక్షన్‌లో నిర్మితమవుతున్న ఈ సినిమా 1980ల నాటి బ్యాక్‌డ్రాప్‌లో సాగనుందని సమాచారం. ఇందులో కాగా ఇప్పటికే విడుదలైన లుక్స్ లో..నానిఈ మూవీలో ఓ కొత్త తరహా మాస్ రోల్‌లో కన్పించనున్నాడు అని స్పష్టంగా అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ విలన్‌గా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ది ప్యారడైజ్ ఒక ఇంటర్నేషనల్ స్టాండర్డ్ మూవీ అవుతుంది. తెలుగు సినిమాను గ్లోబల్ లెవెల్‌కి తీసుకెళ్లే స్కోప్ ఈ ప్రాజెక్ట్‌కి ఉందని రాఘవ్ అన్నారు. అంతేకాదు, తన పాత్రకు న్యాయం చేయడానికి తెలుగు నేర్చుకుంటూ, సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలిపారు.

# టీ20లో విధ్వంసం సృష్టించిన ఉర్విల్ పటేల్

కేవలం 28 బంతుల్లోనే సెంచరీ సాధించి టీ20 క్రికెట్‌లో ఒక ఉత్కంఠభరితమైన భారత బ్యాట్స్‌మన్ సంచలనం సృష్టించాడు. భూకంపం వచ్చినట్లుగా ఈ భారత బ్యాట్స్‌మన్ క్రికెట్ మైదానంలో విధ్వంసం సృష్టించాడు. ఈ ప్రమాదకరమైన బ్యాట్స్‌మన్ బ్యాటింగ్ తో ప్రత్యర్థి జట్టు బౌలర్లు చేతులు ఎత్తేశారు. ఈ భారత బ్యాట్స్‌మన్ తన చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లో సిక్సర్ల వర్షం కురిపించి సత్తా చాటాడు.భారత 26 ఏళ్ల తుఫాన్ బ్యాట్స్‌మన్ ఉర్విల్ పటేల్ టీ20 క్రికెట్‌లో ఈ మైలురాయిని సాధించాడు. సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ (SMAT) 2024-25 సీజన్‌లో గుజరాత్ తరపున ఆడిన ఉర్విల్ పటేల్, నవంబర్ 27, 2024న త్రిపురతో జరిగిన టీ20 మ్యాచ్‌లో 28 బంతుల్లో సెంచరీ సాధించాడు. మొత్తం టీ20 క్రికెట్‌లో ఇది ఒక భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన వేగవంతమైన సెంచరీ ఇదే కావడం గనమార్హం. ఉర్విల్ పటేల్ 28 బంతుల్లో సెంచరీ సాధించి 35 బంతుల్లో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఉర్విల్ పటేల్ 322.85 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ 12 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. ఈ రికార్డుతో, ఐపీఎల్‌లో 30 బంతుల్లో సెంచరీ చేసిన క్రిస్ గేల్ రికార్డును ఉర్విల్ పటేల్ అధిగమించాడు. ఇండోర్‌లో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో, త్రిపుర ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 155/8 పరుగులు చేసింది. త్రిపుర గుజరాత్‌కు విజయానికి 156 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చింది. దీనికి సమాధానంగా, గుజరాత్ 10.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 156 పరుగులు చేసి 58 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.కొన్ని రోజుల తర్వాత, భారత బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ ఉర్విల్ పటేల్ ఘనతను పునరావృతం చేశాడు. ఉర్విల్ పటేల్ ఘనత తర్వాత, శర్మ డిసెంబర్ 5, 2024న సయ్యద్ ముష్తాక్ అలీ టీ20 ట్రోఫీ 2024 టోర్నమెంట్‌లో మేఘాలయపై 28 బంతుల్లో సెంచరీ సాధించాడు. మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో శర్మ 29 బంతుల్లో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. ఈ కాలంలో అతని స్ట్రైక్ రేట్ 365.51గా నిలిచింది.సాహిల్ చౌహాన్ ప్రస్తుతం టీ20 క్రికెట్, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ప్రపంచ రికార్డును కలిగి ఉన్నాడు. జూన్ 17, 2024న, ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ సైప్రస్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 27 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. చౌహాన్ 41 బంతుల్లో 144 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో చౌహాన్ స్ట్రైక్ రేట్ 351.21గా నిలిచింది. చౌహాన్ భారత సంతతికి చెందిన ఎస్టోనియన్ క్రికెటర్. చౌహాన్ ఇన్నింగ్స్‌లో 18 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి.ఉర్విల్ పటేల్ ఒక భారతీయ క్రికెటర్. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్, అలాగే నైపుణ్యం కలిగిన వికెట్ కీపర్. అతను గుజరాత్ తరపున దేశీయ క్రికెట్ ఆడుతున్నాడు. IPL 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (తరపున అతను మూడు మ్యాచ్‌లు ఆడాడు. ఉర్విల్ పటేల్ అక్టోబర్ 17, 1998న గుజరాత్‌లోని మెహ్సానాలో జన్మించాడు. 2024-25 సయ్యద్ ముష్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఉర్విల్ పటేల్ ఆరు ఇన్నింగ్స్‌లలో 78.75 సగటు, సుమారు 229.92 స్ట్రైక్ రేట్‌తో 315 పరుగులు సాధించి వార్తల్లో నిలిచాడు. ఉర్విల్ పటేల్ 50 టీ20 మ్యాచ్‌లలో 1,230 పరుగులు చేశాడు.

# 221 పరుగులతో వైభవ్ సూర్యవంశీ శివతాండవం

వైభవ్ సూర్యవంశీ అండర్-19 క్రికెట్ కెరీర్ జోరుమీదుంది. అతను గత సంవత్సరం భారత అండర్-19 జట్టుతో అరంగేట్రం చేశాడు. కానీ, ఇప్పటివరకు ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుతో అతను ఆడిన క్రికెట్ చూస్తే.. అతను సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి ఆటగాళ్ల మాదిరిగానే కంగారూలతో ఆడటం ఆనందిస్తున్నాడని సూచిస్తుంది. ప్రత్యేకంగా రెడ్-బాల్ క్రికెట్ గురించి మాట్లాడితే, అంటే, మల్టీ-డే మ్యాచ్‌ల్లో చెలరేగిపోతున్నాడు. భారత అండర్-19 జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. అక్కడ అక్టోబర్ 7 నుంచి ప్రారంభమయ్యే రెండవ మల్టీ-డే మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో ఇది చివరి మ్యాచ్ కూడా అవుతుంది.వైభవ్ సూర్యవంశీ మ్యాచ్ గణాంకాలను పరిశీలిస్తే, అతను ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుపై తన ఎక్కువ పరుగులు ఎలా సాధించాడో మీకు అర్థమవుతుంది. అంతే కాదు, అతని అత్యధిక సెంచరీలు, అత్యధిక సిక్సర్లు, బహుళ-రోజుల మ్యాచ్‌లలో ఉత్తమ సగటు కూడా ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుపైనే ఉన్నాయి.వైభవ్ సూర్యవంశీ తన అండర్-19 కెరీర్‌లో ఐదు మల్టీ-డే మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో మూడు ఆస్ట్రేలియా అండర్-19తో, రెండు ఇంగ్లాండ్‌తో జరిగాయి. ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మ్యాచ్‌లలో, అతను 55.25 సగటుతో 221 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్‌పై అతని సగటు 22.50 మాత్రమే.వైభవ్ సూర్యవంశీ తన అండర్-19 మల్టీ-డే మ్యాచ్ కెరీర్‌లో మొత్తం 15 సిక్సర్లు కొట్టాడు. వాటిలో 12 ఆస్ట్రేలియాపైనే వచ్చాయి. అంటే, అతను ఇంగ్లాండ్‌పై కేవలం మూడు సిక్సర్లు మాత్రమే కొట్టాడు. ఈ 12 సిక్సర్లతో పాటు, వైభవ్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో 23 ఫోర్లు కూడా కొట్టాడు.వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు మల్టీ-డే మ్యాచ్‌లలో రెండు సెంచరీలు సాధించాడు. రెండూ ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగినవే. అతను ఆ సెంచరీలలో ఒకదాన్ని భారత గడ్డపై తన తొలి ఇన్నింగ్స్‌లోనే సాధించగా, రెండవది ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో వచ్చింది.వైభవ్ సూర్యవంశీ రికార్డును చూస్తుంటే, సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ లాగానే అతను ఆస్ట్రేలియాను ప్రేమిస్తున్నట్లు అనిపిస్తుంది . టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ అత్యధిక సెంచరీలు సాధించాడు.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999